# నా పెళ్ళాం నాకే సొంతం!

ఉదయం—

గూడూరు రైల్వే జంక్షన్‌లో కృష్ణా ఎక్స్‌ప్రెస్ కదలబోతోంది. వంశీ నెల్లూరు వెళ్ళాలి. ఎక్కేశాడు.

పరవాలేదు. ఓ బెర్త్ ఖాళీగావుంది. కూర్చున్నాడు. పక్కగా వుండే సింగిల్ సీట్స్‌లో— ఓ అందాల రాశి. ఆమెకెదురుగా ఓ వృద్ధురాలు కూర్చుని వున్నారు. వంశీకి ఎదురు బెర్త్‌లో ఓ వ్యక్తి సీరియస్‌గా న్యూస్ పేపర్‌లో మునిగిపోయి వున్నాడు.

ఎక్స్‌ప్రెస్ గూడూరును వదిలేసింది.

వంశీ కిటికీ ప్రక్కనే కుందనపు బొమ్మలా, పొందికగా కూర్చొని వున్న ఆ అందాల రాశి మీది నుంచి చూపులు మరల్చలేకపోతున్నాడు!

ప్రయాణాల్లో అందాన్ని వెదకడమూ, పరిశీలించడమూ, ఆస్వాదించడమూ అతనికి వెన్నతోబెట్టిన విద్య! అయినా ఇంత గొప్ప అందాన్ని అతను ఏనాడూ దర్శించి ఎరగడు!

వెన్నెల, వెన్న, తేనె, శ్రీగంధం, గులాబిరేకులు అన్నీ జాతిదంతం మీద రుద్దివట్టు; కాంతి కరిగి, వెండి కొండపై ప్రవహిస్తూ, అందమైన స్త్రీమూర్తిగా ఆకృతి దాల్చినటు పాలరాతి శిల్పంలాంటి ఆ ముగ్ధమోహన మూర్తి తేజస్సుతో అలరారుతోంది.

ఓహ్........

గాలికి ఫాలభాగంమీద సుతారంగా నృత్యం చేస్తున్నట్టు ముంగురులు; బంగారు గనుల్లో దేదీప్యమానంగా కాగడాలు వెలిగించినట్టున్న కళ్ళు; మధువుల తడి అరుణిమతో మృదువుగావున్న అధరాలు; నిక్కి, దైవసాన్ని ధ్యానికి దారి చూపుతున్నట్లున్న గాలి గోపుర శిఖరాల్లాంటి చనుదోయి.... ప్రపంచంలోని అద్భుత సౌందర్యం ఒకేచోట విరబూసినట్టు: ఆకసంలోని నక్షత్రాలన్నీ ఒకేచోట, ఒకేసారి తళుక్కుమన్నట్టు.... దృష్టి మరలించుకో లేక అనిమిషుడయ్యాడు వంశీ!

ముసలావిడ కునుకుతోంది....లాభం!

ఎదురుగావున్న పేపర్‌వాలా వరల్డ్ న్యూస్‌లో పూర్తిగా నిమగ్ను డయినట్టున్నాడు. మరి....అక్కడ మరెవ్వరూ లేరు వంశీ దృక్కులను గమనించడానికి, అదో అడ్వాంటేజ్.

చేతిలోవున్న "డెబొనీర్" మాగజైన్‌ను ఆమెకు ఆఫర్ చేశాడు—అందులోవున్న "నగ్న చిత్రాల"ను వీక్షించి అయినా, తన చిత్తంలోని చాపల్యాన్ని అవగాహన చేసుకోగలదనీ... ఆ పైని రసస్పందనతో జరిగే పరిణామాల మధురోహలతో ఉత్తేజితుడవుతూ, ఆమె అంగాంగ ఆకృతు లను ఆకళింపు చేసుకునేందుకు ఉద్యుక్తుడవుతూ.

తీర్చిదిద్దినట్టున్న కనుబొమ్మలతో చిత్రంగా కళ్ళు పైకెత్తింది ఆమె. ఆ పుస్తకాన్ని చూస్తూ చిత్తరువులావుంది. సూటిగావున్న ఆమె నాశికాగ్రం సువాసనలు విరజిమ్మినట్టు; సృష్టి ఓ క్షణం ఆమె చూపు ముందు ఆగినట్టు .. వంశీలో రక్తప్రసరణ ఓ క్షణం ఆగి, మరలా సాగినట్టు....రక్తంలోని రంగు కణాలు ముక్తకంఠంతో సరాగాల మాలికలను జపిస్తున్నట్టు.... దేనికోసమో తపిస్తున్నట్టు.

ఆమె పుస్తకాన్ని అందుకుంటున్నప్పుడు చూశాడు. తెల్లని నునుపైన ఆ అంగుళీయముల మృదు చర్మం క్రింది సన్నగా మెరుస్తున్న నీలి రక్తనాళాల గమకాలను; చమక్కులను.... ఆమె విస్ఫారితనేత్రమై–పుస్తకాన్ని విప్పి చూసింది–సభ్యతాయుత చిరు నగవుతో. కానీ, పూర్తిగా బట్టలు లేకుండా అక్కడ నిలబడి పోజ్‌లోవున్న స్త్రీ మూర్తి యవ్వనం కంట పడగానే ఆ నగవు మాయమయింది; ఆమె కనుబొమలు ముడిపడ్డాయి; కళ్ళు కనిష్ఠువులయ్యాయి– ఏదో చీదరింపు; వెగటు, ఆమె మోములో అచ్ఛాదించుకుంది.

వేగంగా పుస్తకాన్ని మూసి, తిరిగి యిచ్చేసింది. చిరాగ్గా తల తిప్పేసుకుంది. పవిట నిండుగా కప్పుకుంది. సర్దుకుని కూర్చుంది. చీకాకు కళ్ళల్లోంచి ప్రసారమై, చెక్కిళ్ళల్లో ఎర్రబారి, ముక్కుపుటాలలో బహిర్గతమయింది, రోషంగా మారి.

రంగుల కల భగ్నమైనట్టు ఉలిక్కిపడ్డాడు వంశీ. ప్రతి అభివ్యక్తీకరణలో– ఎన్నో భంగిమలు; మరెన్నో సౌందర్య సంకేతాల ప్రసారాల పారావారాలు! ఇలా ఇంత అందాన్ని బిగిరించుకుని ఒంటరిగా సాగిస్తున్న ఈ ప్రయాణం ఏ దివ్య లోకాలకో? ఆమె పాదాల మీద పారాణిగా ఘడియ మెరిస్తే చాలు

ట్రయిన్ కూత వినిపించింది.

ఇహంలోకి వచ్చిపడ్డాడు వంశీ.

నెల్లూరు దగ్గరకు వచ్చేసింది!

అక్కడ దిగిపోవాలన్న తలంపు రాగానే వంశీ దిగాలు పడిపోయాడు.

ఊహుఁ....! వీల్లేదు ఎంత దూరమయినా సరే. ఏ ఆనంద లోకాలకయినా సరే ...ఆమెతోపాటే ...ఆమెతో మాట్లాడాలి. ఆమెకు చేరువ కావాలి ఇన్నాళ్ళ తన అనంతకోటి ఆలోచనలకు అర్థం స్ఫురించింది.

పేపరువాలా తనను గమనిస్తున్నట్టు లీలగా పసికట్టాడు వంశీ.

"బాబూ! మీకు పెళ్ళైందా?" అని అడిగాడు, ఆ వ్యక్తి పేపరు మడిచి పక్కన పెడుతూ.

'ఏం? ఎందుకలా అడుగుతున్నాడు? కొంపదీసి అంతా పరిశీలించాడా? ఏమో? తన రసలోకంలో తనుండి పోయాడు?'— అనుకుంటూ సర్దుకుని, 'కొంచెం తేరుకుని, "అయిందండీ! ఏం?" అన్నాడు వంశీ సందిగ్ధ స్వరంతో.

"ఆఁ.... ఏంలేదు—ఇదే బండిలో మీ భార్య అలా కిటికీ దగ్గర ఒంటరిగా కూర్చుని ప్రయాణం చేస్తూ ఉంటే— మీలాగా నేనూ సిగ్గు విడిచి, ఆత్రంగా, అమర్యాదగా అలా చూస్తే మీరు సహిస్తారా?" అన్నాడు సూటిగా.

కంచీతో "చెళ్"మనిపించినట్టయింది—తడబడ్డాడు వంశీ. "ఊహుఁ.... సహించను. నాభార్య నాకే సొంతం. అయినా మీకేంటి? ఎందుకలా అడిగారు?" దబాయించబోయాడు, స్వరాన్ని తగ్గించుకుంటూనే.

"మీరు ఇప్పటివరకూ అలా చూసింది నాభార్యను కాబట్టి"— అన్నాడా వ్యక్తి గంభీరంగా. స్టేషన్‌లోకి బండి రావడమూ, మారు మాట లేకుండా, వెనుదిరిగి చూడకుండా వంశీ ట్రయిన్ దిగి వెళ్ళిపోవడమూ ఒకే క్షణంలో జరిగిపోయాయ్.

★